## క్లుప్తంగా

### శాకంబరి అలంకరణలో విజయదుర్గాదేవి



వివిధ రకాల కూరగాయలతో అలంకరించిన విజయదుర్గాదేవి అమ్మవారు

**ఆరిలోవ:** శ్రావణ మాసం మొదటి శుక్రవారం దుర్గాదేవి ఆలయాలు సందడిగా మారాయి. ఆరిలోవలో మహిళలు దుర్గాదేవి ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు పూజలు చేశారు. బాలాజీనగర్‌లో దుర్గాదేవి, నూకాలమ్మ ఆలయాలు, తోటగరువు వద్ద ఎర్నిదుర్గాలమ్మ గుడి, లలితానగర్‌లో లలితాదేవి ఆలయం, హనుమంతవాక విజయదుర్గాదేవి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు పూజలు చేశారు. తొలి శుక్రవారం పూజల్లో భాగంగా విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శాకంబరి దేవిగా ఆలయ నిర్వాహకులు వివిధ కూరగాయలతో అలంకరించారు.

### టీచర్ల సమస్యలపై నిరసన నేడు

**ఆరిలోవ:** ఉపాధ్యాయుల సమస్యలపై డీఈవో కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలపనున్నట్లు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ దాసరి రాజు తెలిపారు. ఈ మేరకు వినతి పత్రాన్ని ఫ్యాప్టో ప్రతినిధులతో కలిసి శుక్రవారం డీఈవో కార్యాలయంలో విద్యా శాఖాధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### దుర్గాదేవి ఆలయంలో కుళాయి ఏర్పాటు

**ఎంవీపీకాలనీ:** స్థానిక 17వ వార్డులోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో నూతనంగా కుళాయి ఏర్పాటు చేశారు. స్థానికుల అభ్యర్థన మేరకు కార్పొరేటర్ గేదెల లావణ్య ఈ కుళాయిని అందుబాటులోకి తెచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు శుక్రవారం ఈ కుళాయిని ప్రారంభించడంతో పాటు అమ్మవారి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వార్డు నాయకులు పాల్గొన్నారు.

### కీళ్ల సమస్యలపై ఉచిత వైద్య శిబిరం రేపు

**ఏయూక్యాంపస్:** ఆయుష్మాన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి కీళ్ల సంబంధిత సమస్యలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ కె.స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహారాణిపేటలోని తమ ఆస్పత్రి ఆవరణలో డాక్టర్ ఎం.పార్థసారథి కీళ్ల సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, సమస్య ఉన్నవారిని పరీక్షించి తగు చికిత్స విధానాలను సూచిస్తారని పేర్కొన్నారు. ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్ష చేసి, ఎక్స్‌రే తీస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. సమాచారం కోసం 81889 31889 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

### అలరించిన గీతాలాపన

**సీతంపేట:** రాగమాలిక సాంస్కృతిక సంస్థ 15వ వార్షికోత్సవం శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు మీనాకుమారి, ఆదిలక్ష్మి, ఇందిరా సాహిని, శైలజ, శ్వేత, సుబ్బారావు, పార్థసారధి, భరద్వాజ్, రాజు, చింతపల్లి సత్యనారాయణ, ఆనందరావు అలనాటి మేటి గీతాలను ఆలపించి అలరించారు. ముందుగా ఇటీవల పరమపదించిన జానపద ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు.



# రోడ్ల విస్తరణకు చర్యలు

- ఆరిలోవలో పర్యటించిన మేయర్, కమిషనర్
- కాలువలు, రోడ్ల నిర్మాణాల వేగవంతానికి ఆదేశాలు



పెదగదిలి, తోటగరువు రోడ్డును పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ

**ఆరిలోవ:** ఆరిలోవ ప్రాంతంలో అవసరమైన చోట్ల రోడ్లను విస్తరించనున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీలో పలు విభాగాలకు చెందిన అధికారులతో కలసి శుక్రవారం ఆరిలోవ ప్రాంతంలో వారు పర్యటించారు. బీఆర్‌టీఎస్ కారిడార్‌లో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు, రవీంద్రనగర్, బాలాజీనగర్, పార్వతీనగర్, చినగదిలి వరకు వెళ్లారు. రోడ్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న కాలువలు, రోడ్ల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీపడితే చర్యలు తప్పవన్న హెచ్చరికలు జారీ చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి అంబేడ్కర్ నగర్ కూడలి మీదుగా తోటగరువు కూడలి వరకు ఉన్న రోడ్డు, తోటగరువు కూడలి నుంచి రవీంద్రనగర్ వరకు ఉన్న రోడ్డును విస్తరించనున్నట్లు తెలిపారు. ఆ రోడ్లలో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో, ఉదయం, సాయంత్రం వాహనాల రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా రోడ్లకు ఇరుపక్కల ఉన్న ఆక్రమణలు, బడ్డీలను తొలగించి, రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆరిలోవ ప్రధాన రహదారి, గ్రీన్ బెల్ట్‌లో ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. ఆదర్శనగర్ ప్రాంతం వివేకానందనగర్ పార్కును ఆధునీకరించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు.
ఈ పర్యటనలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ రవి కృష్ణంరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, రెండో జోన్ జెడ్సీ కనకమహాలక్ష్మి, ఏఎంవో డాక్టర్ కిశోర్, కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి సాయం

- డీఎంహెచ్‌వో చేతుల మీదుగా రూ.1.68 లక్షల అందజేత



మృతి చెందిన హెల్త్ అసిస్టెంట్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

**మద్దిలపాలెం :** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ పుట్టా రాజేంద్ర ప్రసాద్ కుటుంబానికి సహచర కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు, ఏపీఎన్‌జీవో నాయకులు రూ.1.68 లక్షలు ఆర్థిక సాయం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ల నుంచి రూ.1.18 లక్షలు, మృతుడు పనిచేసిన పెందుర్తి ఆరోగ్యకేంద్రం సిబ్బంది రూ.40 వేలు, ఏపీఎన్‌జీవో నాయకులు రూ.10 వేలు సేకరించి ఆ మొత్తాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అకస్మాత్తుగా మరణించిన తమ సహచరుని కుటుంబానికి అండగా నిలిచిన సిబ్బంది తీరును అభినందించారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున సాయం అందేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లకు ఏ కష్టమొచ్చినా సాయం చేసేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి రవిశంకర్, నగర అధ్యక్షుడు నారాయణరావు, కోశాధికారి ఏపీఎస్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, జిల్లా సంయుక్త కార్యదర్శి నరం నాయుడు, పెందుర్తి సీహెచ్‌వో స్వర్ణలత, కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు పేరినాయుడు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

**ఎంవీపీకాలనీ:** ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ సీఐతో పాటు మరికొంతమంది పోలీసుల పట్ల ఓ వ్యక్తి దురుసుగా ప్రవర్తించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్ సిరిపురంలో పర్యటించిన సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఎన్‌ఏడీ విమాననగర్‌కు చెందిన తమ్మినేని శ్రీనివాసరావు(53) పవన్ కల్యాణ్ రోడ్డుషోకు వచ్చాడు. ఈ క్రమంలో అక్కడ భద్రతా విధులు నిర్వర్తిస్తున్న ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావుతో పాటు హెడ్‌కానిస్టేబుల్స్, మరికొంతమంది పోలీసుల పట్ల దురుసుగా వ్యవహరించడంతో పాటు దుర్భాషలాడాడు. పోలీసులు వారిస్తున్నా వినకుండా దాడికి యత్నించాడు. ఈ హఠాత్ పరిణామంతో పోలీసులు కంగుతిన్నారు. అనంతరం అతని వివరాలు సేకరించిన పోలీసులు 3వ పట్టణ పోలీసు స్టేషన్‌లో 12న ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 3వ పట్టణ పోలీసులు శ్రీనివాసరావుపై సెక్షన్ 332 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రావణ లక్ష్మీ నమోస్తుతే

- ఘనంగా తొలి శుక్రవారం కుంకుమ పూజలు



పోలమాంబ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



లలితాపీఠంలో..



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



అమ్మవారికి పూజలు చేస్తున్న పురోహితులు

**ఏయూక్యాంపస్:** మహిళలు ఎంతో భక్తి ప్రపత్తులతో మహాలక్ష్మి అమ్మవారిని కొలిచే శ్రావణమాసం ప్రారంభమైంది. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయాలలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు.

**పోలమాంబ ఆలయంలో..**
పెదవాల్తేరులో కొలువైన 14 గ్రామాల కులదైవం పోలమాంబ ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఐదు శుక్రవారాలు ఈ పూజలు జరగనున్నాయి. తొలి శుక్రవారం సందర్భంగా ఆలయ మండపంలో కుంకుమ పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 31న శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనవచ్చని పేర్కొంది. కుంకుమ పూజలో ఆలయ ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ పి.శంకర రెడ్డి పాల్గొన్నారు.

**లలిత పీఠంలో విశేష పూజలు**
శ్రావణలక్ష్మీ స్వరూపమైన శ్రీ లలితా త్రిపురసుందరీ పీఠంలో శ్రావణమాసం పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి మహిళలచే స్వయంగా లలితా సహస్రనామార్చనతో కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రావణమాసం నెల రోజులు అమ్మవారికి భక్తుల గోత్రనామాలతో కోటి కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కాండూరు లక్ష్మణ స్వామి తెలిపారు.

**కనకమ్మ ఆలయంలో..**
స్థానిక 21వ వార్డులోని కనకమహాలక్ష్మి(దుర్గ) అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి, పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త మండలి చైర్‌పర్సన్ కొయ్య గంగా దేవి, సభ్యులు విజయ్, ధనలక్ష్మి, దత్తాత్రేయ సాయి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్‌లో అరుదైన రోబోటిక్ సర్జరీ



సర్జరీ అనంతరం కోలుకున్న నరేష్‌తో డాక్టర్ కార్తీక్ చంద్ర వల్లం, తదితరులు

**ఎంవీపీ కాలనీ:** మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఓ రోగికి అరుదైన రోబోటిక్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లాకు చెందిన జి.నరేష్(36) తీవ్ర జ్వరంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కారణంగా ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగంలో చేరాడు. ఆయన్ను పల్మోనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తాలే పరీక్షించి క్షయవ్యాధి కారణంగా ఊపిరితిత్తుల చుట్టూ(ప్లురల్ ఎఫ్యూషన్) నీరు ఉందని గుర్తించారు. శస్త్ర చికిత్స ద్వారా ఆ నీరును తొలగించాలని సూచిస్తూ రోబోటిక్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కార్తీక్ చంద్రకు రిఫర్ చేశారు. అనంతరం వీఏటీఎస్(థొరాకోస్కోపిక్) డెకార్టికేషన్ రోబోటిక్ సర్జరీ ద్వారా ఊపిరితిత్తుల విస్తరణను నిరోధించే కణజాల పొరతో పాటు ఊపిరితిత్తుల చుట్టూ ఉన్న నీరును తొలగించారు. శరీరంపై 5–6 సెంటీమీటర్ల చిన్నపాటి రంధ్రం ద్వారా సున్నితమైన ఈ సర్జరీని డాక్టర్ కార్తీక్ చంద్ర బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోగి వేగంగా కోలుకుని, 4 రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారు. డాక్టర్ కార్తీక్ చంద్ర బృందాన్ని ఆస్పత్రి వర్గాలు అభినందించాయి.

## ఘనంగా సద్భావనా దివస్

**తాటిచెట్లపాలెం:** వాల్తేర్ డివిజన్ పరిధిలో సద్భావనా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం వద్ద ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ అధికారులు, సిబ్బంది చేత సద్భావనా ప్రతిజ్ఞ చేయించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఆగస్టు 20న సద్భావనా దివస్‌గా పాటిస్తారు. ఈ ఏడాది ఆగస్టు 20వ తేదీ ఆదివారం కావడంతో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు. రాజీవ్ జయంతిని దేశ ప్రజల మధ్య జాతీయ సమైక్య, శాంతి, సామాజిక సమానత్వం, ఐక్యతలకు గుర్తుగా అవలంబిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) సుదీర్‌కుమార్ గుప్తా, ఇతర బ్రాంచి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యంతోనే విద్యలో రాణింపు



నేత్ర పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ సిబ్బంది

**డాబాగార్డెన్స్:** చదువులో మరింతగా రాణించాలంటే ఆరోగ్యంగా ఉండాలని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ నేతృత్వంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం కళాశాల ఆవరణలో ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, ఆరోగ్యంపై జాగ్రత్త వహించినప్పుడే ఏ రంగంలోనైనా ముందుకు సాగిపోవచ్చన్నారు. విద్యార్థులకే కాక వారి తల్లిదండ్రులకు కూడా ఉచిత వైద్య సేవలందించినట్టు చెప్పారు. నేత్ర వైద్య శిబిరంలో కళ్లద్దాలు అవసరమైన వారందరికీ శంకర్ ఫౌండేషన్ నిర్వాహకులు అందించారు. వారిని ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు అభినందించారు. శంకర్ ఫౌండేషన్ హెచ్ఆర్ చంద్రశేఖర్, దంత వైద్య నిపుణులు డాక్టర్ శరణీ దీపిక, డాక్టర్ చాందిని, కళాశాల డీన్ శంకరనారాయణ, ఇంగ్లిష్ విభాగాధిపతి పైడి రజని, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పోలమాంబ ఆలయ ఈవోగా గాయత్రి



బాధ్యతలు స్వీకరించిన ఈవో గాయత్రి

**ఏయూక్యాంపస్:** స్థానిక 20వ వార్డులోని పెదవాల్తేరులో వెలసిన కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి(ఈవో)గా కె.గాయత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో పూర్వ ఈవో డీవీఎస్ సురేష్‌బాబు, పాలక ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శంకర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు మాదు మంగరాజు, నీలాపు నైటమ్మ, నందూరి కృష్ణమోహన్, మరడ నాగమణి, ఎంఎస్‌వీ రమణమ్మ, బి.భారతి తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## నేటి నుంచి స్టీల్‌ప్లాంట్‌లో ఛాయా చిత్ర ప్రదర్శన



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

**ఏయూక్యాంపస్:** వాల్తేర్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సంయుక్తంగా శని, ఆదివారాలలో ఛాయాచిత్ర(ఫోటో) ప్రదర్శన నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి ఎం.వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం పెదవాల్తేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రదర్శనను శనివారం ఉదయం స్టీల్ ప్లాంట్ ఉక్కు హౌస్ సమావేశ మందిరంలో సీఎండీ అతుల్ భట్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రదర్శనలో 1940 నుంచి 2023 వరకు వాడుకలో ఉన్న వివిధ పురాతన కెమెరాలను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ ఫొటో జర్నలిస్టు సీవీ సుబ్రహ్మణ్యానికి డా.పిల్లా రాజారావు(వాసు) జీవిత సాఫల్య పురస్కారం, సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎన్‌వీవీఎస్ ప్రసాద్‌కు బండి వెంకట రమణ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందిస్తామన్నారు. జూలై 21, 22, 23 తేదీల్లో అరకులో నిర్వహించిన ఫొటో వర్క్‌షాప్‌లో పాల్గొన్నవారి ఫొటోల్లో ఉత్తమమైన వాటిని ఎంపికచేసి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు పీఎస్ సేత్, గౌరవ అధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జగపతిరాజు, కోశాధికారి వి.వి.రామరాజు, వి–డెంటల్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అగనంపూడి టోల్ గేట్ తొలగించాలి



మాట్లాడుతున్న 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు

**మద్దిలపాలెం :** నిబంధనలకు విరుద్ధంగా ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న అగనంపూడి టోల్ గేట్‌ను వెంటనే తొలగించాలని సీపీఎం నాయకుడు, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు డిమాండ్ చేశారు. పిఠాపురంకాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో టోల్ గేట్ ఉండకూడదని ప్రభుత్వ నిబంధనలు చెప్తున్నా, బీజేపీ ప్రభుత్వ నాయకుల అండదండలతో అక్రమంగా టోల్‌గేట్‌ను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. దీన్ని తక్షణమే తొలగించాలన్న డిమాండ్‌తో ఈ నెల 21న టోల్ గేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, ఉద్యోగులు, వాహన చోదకులు, క్యాబ్, లారీ ఓనర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొని, ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మద్దిలపాలెం జోన్ కార్యదర్శి క్రిష్టారావు తదితరులు పాల్గొన్నారు.

# అనధికారక నిర్మాణాల తొలగింపు



ఇందిరానగర్‌లో అనధికారికంగా వేసిన ఐదో ఫ్లోర్‌ను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



రవీంద్రనగర్‌లో బస్ షెల్టర్‌లో నిర్మించిన షాపు తొలగింపులో సిబ్బంది

**ఆరిలోవ:** జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పదో వార్డులో జరిగిన అనధికారిక నిర్మాణాలను శుక్రవారం రెండు చోట్ల తొలగించారు. వార్డులో ఉదయం పర్యటించిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ రవీంద్రనగర్ బస్ షెల్టర్‌లో ఓ వ్యక్తి నిర్మించిన షాపును పరిశీలించారు. దాన్ని వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో జోన్–2 ఏసీపీ వెంకటేశ్వరరావు సూచనలతో జీవీఎంసీ బృందం బస్ షెల్టర్‌లో షాపు గోడతో పాటు షట్టర్‌ను తొలగించారు. అనంతరం అదే వార్డు పరిధి పాత డెయిరీఫారం వద్ద ఇందిరానగర్‌లో ఓ వ్యక్తి అనధికారికంగా నిర్మించిన ఐదో ఫ్లోర్‌ను తొలగించారు. నాలుగు ఫ్లోర్లకు అనుమతి తీసుకుని, అనధికారికంగా ఐదో ఫ్లోర్ నిర్మించడంతో తొలగించినట్లు ఏసీపీ వెంకటేశ్వరరావు తెలిపారు.

# సముద్ర జలాల పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

**మద్దిలపాలెం:** సముద్ర జలాల పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. కళాశాల జంతు శాస్త్ర విభాగం, ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సముద్ర కాలుష్యం వలన జల జీవరాశులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి మనుగడకు, జల కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా విభాగాధిపతి డి.భూమిరెడ్డి మాట్లాడుతూ సముద్ర జలాల పరిరక్షణ బాధ్యత విద్యార్థులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగం అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, శ్రావణ్‌కుమార్, రవిబాబు, శ్యామ్యూల్ డేవిడ్‌రాజు, రామారావు, శాంతి ప్రభలు పాల్గొన్నారు.

# వ్యక్తి ప్రగతికి అంతర్గత ప్రేరణ కీలకం



వీసీ ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

**ఏయూ క్యాంపస్:** అంతర్గత ప్రేరణే వ్యక్తి ప్రగతిలో కీలకమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి సీఏ విద్యార్థుల సదస్సు సంకల్ప్–23ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ యువత కొత్త ఆలోచనలు దేశానికి పెద్ద సంపదగా మారనున్నాయన్నారు. ప్రపంచం శరవేగంగా మార్పులకు లోనవుతోందని, అన్ని రంగాలు తదనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి అసాధారణ ప్రగతిని సాధించిన వ్యక్తులు ఈ రెండు రోజులు స్ఫూర్తి ప్రసంగాలు చేస్తారన్నారు. ఎస్ఎస్ఈబీ చైర్మన్ మంగేష్ పి కినరే మాట్లాడుతూ నూతన కరిక్యులంను అమలు చేస్తున్నామన్నారు. విదేశాల్లో కూడా తమకు 45 శాఖలు ఉన్నాయని, ప్రత్యక్ష శిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు శ్రీధర్ మప్పల మాట్లాడుతూ సీఏ వృత్తిలో అడుగిడటం విజయానికి ఆరంభంగా మాత్రమే భావించాలన్నారు. సదస్సు సంచాలకుడు డి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌కు అవసరమైన బలమైన పునాదులు నిర్మించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్‌సీ, సికాస చైర్మన్ ఆర్.చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ సహనం కలిగి ఉండటం, ఏకాగ్రతతో పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సికాస చైర్మన్ స్వరూప్, వైస్ చైర్మన్ పి.నాని కార్తీక్, విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ ప్రసాద్ కె.పాండ, పెద్ద సంఖ్యలో సీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

### బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా నాగేంద్ర



**ఎంవీపీ కాలనీ:** బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా ఎం.నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు దుగ్గుబాటి పురందేశ్వరి నియామక పత్రం జారీ చేసినట్టు ఆ పార్టీ విశాఖ కార్యాలయం వెల్లడించింది. ఈ సందర్భంగా నాగేంద్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు.